క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



చిల్పూరు : ఈనెల 6వ తేదీనుంచి ప్రారంభమయ్యే చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛంతో పాటు ఆహ్వానపత్రికను చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అందజేశారు. హనుమకొండలోని ఆయన నివాసంలో చైర్మన్, ధర్మకర్తలు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ధర్మకర్తలు బుచ్చయ్య, నారాయణరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, చల్ల వెంకటరమణాదేవి, గోలి రాజశేఖర్, గనగోని రమేష్, భూక్య శ్రీనివాస్, వేముల వెంకటేశ్వర్లు, పులికాశి రాజయ్య, మోతె మహేష్, కొలిపాక రాజు, ఎడమ అశోక్, చెట్కూరి రవిలతో పాటు పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, అశోక్‌పాల్ ఉన్నారు.

బీరప్ప కల్యాణానికి విరాళం



బచ్చన్నపేట : మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో నిర్వహించనున్న కురుమల ఆరాధ్య దైవమైన శ్రీ బీరప్ప–కామరాతిల కల్యాణానికి అదే గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు బేజాడి బీరప్ప విరాళం అందజేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీరప్ప పండుగకు తనవంతు సాయంగా రూ.1,11,111లను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కల్యాణ ఆహ్వాన పత్రికను అందించారు. బేజాడి సిద్దులు, ఒగ్గు పూజార్లు పలువురు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



చిల్పూరు : మండలంలోని పల్లగుట్టకు చెందిన చిర్ర అకిర నందన్, గౌతమ్ సిద్ధార్థలు కరాటే పోటీల్లో ఆదివారం బ్లాక్ బెల్ట్ సాధించారు. హనుమకొండలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ లెవల్ 7వ కరాటే చాంపియన్ షిప్ పోటీలను సూర్య షోటోకన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించారు. వీరికి మాస్టర్ చంద్రశేఖర్, సురేష్‌ల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

రేపు కేయూలో స్మారకోపన్యాసం

కేయూ క్యాంపస్: ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్ రావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న ఉదయం కాకతీయ యూనివర్సిటీలోని మ్యాథమెటిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో ప్రొఫెసర్ జనార్దన్‌రావు స్మారకోపన్యాసం నిర్వహించనున్నట్లు జనార్దన్‌రావు ట్రస్ట్ కార్యదర్శి బుచ్చిబాబు రావు తెలిపారు. తెలంగాణ ఆఫ్టర్ ఏ డికేడ్ ఎమర్జింగ్ పొలిటికల్ అండ్ సోషల్ సినారియోస్ అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ స్మారకోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఎండోమెంట్ లెక్చర్‌కు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని బుచ్చిబాబు తెలిపారు

పిల్లర్లకే పరిమితం!

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం?
- జనగామ– హుస్నాబాద్ మధ్య రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గానుగుపహాడ్ వద్ద పిల్లర్ల వరకు చేపట్టిన బ్రిడ్జి పనులు

జనగామ రూరల్ : మండలంలోని వడ్లకొండ వద్ద రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు జనగామ–హుస్నాబాద్ మధ్య ఉన్న బ్రిడ్జి కుంగి, కూలిపోయింది. దీంతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించగా మంజూరైంది. కాగా కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి పిల్లర్ల వరకు పనులు పూర్తి చేశారు. కాంట్రాక్ట్‌కు నిధులు విడుదల కాకపోవడంతో పనులను అసంపూర్తిగానే నిలిపివేశారు. తాత్కాలికంగా వేసిన రోడ్డు గతేడాది రెండు సార్లు కొట్టుకుపోగా కంకర, మట్టిపోసి సరిచేశారు. వేసవి కాలంలో నిర్మాణ పనులు పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఒకవేళ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాకపోతే మళ్లీ వర్షాలకు రోడ్డు కొట్టుకు పోయే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు, విద్యార్థులకు తప్పని ఇబ్బంది

జనగామ నుంచి నర్మెట, తరిగొప్పుల, హుస్నాబాద్ వరకు అనేకమంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సుల ద్వారా వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు జనగామలోని కళాశాలలకు వెళ్లి, వస్తుంటారు. అలాగే కరీంనగర్‌కు భారీ వాహనాలు, గ్రానైట్, సరుకుల రవాణా అవుతుంటాయి. వీటితో పాటు రోజు జనగామ, గానుగపహాడ్, వడ్లకొండ, మరిగడి, ఎర్రగొల్లపహాడ్, అడవికేశాపూర్‌తో పాటు స్థానిక తండావాసులు ద్విచక్ర వాహనాలపై వ్యాపారాలకు వస్తుంటారు. పాల ఉత్పత్తులు జనగామకు రావాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాకాలంలో భారీ వాహనాలకు అనుమతి లేకపోవడంతో గానుగుపహాడ్ నుంచి తిరిగి వస్తుంటాయి. దుమ్ము, ధూళి ఇళ్లలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. అదే మార్గంలో మరో కల్వర్టు ఉండగా భారీ వాహనాలతో అది కూడా దెబ్బతినే అవకాశం ఉంది. బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



వర్షాకాలంలో వేరే గ్రామాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి లేక వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదు. యూరియా, డీఏపీ బస్తాలు తీసుకు పోవాలంటే తిప్పలే. బైక్ ఎక్కడ అదుపు తప్పుతుందో అని భయపడుతున్నాం. ప్రభుత్వ అధికారులు బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– ఎడ్ల శ్రీనివాస్, మరిగడి

‘కాంగ్రెస్‌తోనే పేదలకు భరోసా’



నర్మెట: చెక్కు అందజేస్తున్న కిరణ్ కుమార్

నర్మెట : కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు భరోసా లభిస్తోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని మచ్చుపహాడ్ గ్రామానికి చెందిన బైరగోని లక్ష్మి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కిరణ్ కుమార్ రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, అంజయ్య, బాలరాజు, చంద్రయ్య, రాజు గౌడ్, ప్రశాంత్, ప్రసాద్, లక్ష్మయ్య, యాదగిరి, వీరస్వామి, శ్రీనివాస్, దేవ్‌సింగ్, నూనావత్ రాజ్‌కుమార్, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ పాలన

కొడకండ్ల : పేద వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి, అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు భిక్షపతి, రవీందర్, యాకయ్య, వెంకన్న, రవీందర్, రఘుపతి, సోమయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పాలకుర్తి టౌన్ : పాలకుర్తి మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన గోపగాని వెంకటయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన (7 క్వింటాలు) 23 బస్తాలు రేషన్ బియ్యంను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లింగారెడ్డి తెలిపారు. నర్సింగాపురం తండాకు చెందిన భూక్య టీక్యాపై కేసు నమోదు చేసిన రేషన్ బియ్యంను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థికసాయం

కొడకండ్ల : మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన జంపాల మురళీ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీలు అందె యాకయ్య 50 కిలోల బియ్యం, రాంకోటి, ఉప్పలయ్యలు రూ.5 వేల నగదును కుటుంబీకులకు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, శ్రీనివాస్, రవీందర్, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్‌లో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న విద్యార్థులు

జనగామ రూరల్ : జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్‌లో గల సెయింట్ మేరీస్ పాఠశాలలో కేజీ గ్రాడ్యుయేషన్ డేను స్కూల్ డైరెక్టర్లు తుమ్మ రమేష్ రెడ్డి, శ్రీలతరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కట్ల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు ఉన్నతులుగా ఎదగడానికి గ్రాడ్యుయేషన్ మైలురాయి అని తెలిపారు. డైరెక్టర్లు రమేష్ రెడ్డి, శ్రీలత రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ జైమోన్ థామస్, పీఆర్‌ఓ రంగరాజు ప్రసాద్, విజయ్‌పాల్ రెడ్డి, రాజిరెడ్డి, ప్రమీల, నర్మద, శైలజ, సలీం, సంపత్, మైకేల్, శ్రీధర్, గుణవర్ధన్, రాజు, నరసింహ, రాజశేఖర్, హేమలత, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా..పట్టించుకోరా?



వరి పైరును పరిశీలిస్తున్న కళింగరాజు, రైతులు



మరిగడిలో వరిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

- మాజీ ఎంపీపీ కళింగరాజు

జనగామ రూరల్ : యాసంగిలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు తీవ్రంగా మండిపడ్డారు.ఆదివారం శామీర్‌పేట, పసరమడ్ల, ఎల్లంల గ్రామాల్లో రైతులతో కలిసి ఎండిపోయిన వరిపొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో బొమ్మకూరు రిజర్వాయర్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాల చెరువులను నింపడం జరిగిందని, వేసవిలో మత్తళ్లు పడేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బొమ్మకూరు రిజర్వాయర్ ద్వారా ముందు చూపుతో చెరువులను నింపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతుల పొలాలు ఎండిపోతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి పొలాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలి

ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.50వేలు పరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి బోడ నరేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మరిగడి గ్రామంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎండిపోయిన వరి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామ మండలం ఎప్పటికీ కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, భూగర్భ జలాలు అడుగంటి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎండిపోయిన పంటలను పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా సర్వే చేయించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు పోత్కానూరి ఉపేందర్, నాయకులు బోడ రాములు, కూరాకుల శ్రీను, బాల్నే మల్లేష్, కాసాని గట్టయ్య, బండి సుధాకర్, గుగులోత్ రాములు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల : విద్యుదాఘాతంతో మృతిచెందిన సులుగూరి యాదమ్మ కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని కడవెండిలో రెండ్రోజుల కిందట విద్యుదాఘాతంతో మృతిచెందిన యాదమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు తాటిపల్లి మహేష్, సుడిగెల హన్మంతు, దుబ్బాక రత్నాకర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ చేయూత

బాధిత కుటుంబానికి ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ చైర్మన్ పెద్దపూడి ప్రసన్నకుమార్ రూ.6వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్తుల సుధాకర్, జేరిపోతుల శ్రీను, సుధాకర్, కత్తుల పవన్, హోలీఫైర్ చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ

బచ్చన్నపేట : మండలంలోని చిన్నరామన్‌చర్ల శివారులో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు చోరీ చేశారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం..25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి పగులగొట్టి అందులో ఉన్న కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. అసలే ఎండలు సమీస్తున్న తరుణంలో పంటలకు సాగు నీరు అందించడం చాలా కష్టంగా ఉంది. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరు ఎత్తుకెళ్లడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని బాధిత రైతులు వాపోయారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఘటన స్థలం వద్దకు ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మెన్ మెతుకు జలేందర్‌రెడ్డిలు వెళ్లి పరిశీలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



దుండగులు ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బస్టాండ్‌లో సీసీ కెమెరాలు, ఫ్యాన్ల ఏర్పాటు

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ సహకారంతో ప్రయాణికుల సౌకర్యం కోసం ఆదివారం బెంచీలు, ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. అలాగే బస్టాండ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా సీఐ మహేందర్‌రెడ్డి ఆదేశాలతో గూడూరు గ్రామానికి చెందిన మాచర్ల పుల్లయ్య సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై లింగారెడ్డి తెలిపారు. పోతుగంటి నర్సయ్య, రాంరెడ్డి, జిలుకర తిరుమల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ పండుగ



నర్మెట: దుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే పల్లా



నర్మెట: బోనాలతో వెళ్తున్న మహిళలు

నర్మెట : మండల కేంద్రంలో దుర్గమ్మ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బూస అంజయ్య ఆధ్వర్యంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి దుర్గామాతను సందర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.దుర్గమ్మపండుగను ప్రజలు ఘనంగా నిర్వహించడంతో విచ్చేసిన బంధువులతో మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై (జనగామ–హుస్నాబాద్) పలుమార్లు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు పాడిపంటలతో గ్రామాలను చల్లంగా చూడాలని కోరుకున్నారు.

ఎల్లమ్మ ఉత్సవాలను జయప్రదం చేయండి

చిల్పూరు : చిల్పూరుగుట్ట వద్ద ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ గనగోని రమేశ్ గౌడ్ కోరారు. ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించే ఉత్సవ ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ఆదివారం గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గనగోని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

దుర్గామాత ఆలయంలో..

బచ్చన్నపేట : మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో గల దుర్గామాత ఆలయంలో పలువురు నాయకులు ఆదివారం పూజలు చేశారు. రాత్రి వేళ దుర్గామాత కల్యాణాన్ని బైండ్ల వారు నిర్వహించగా గ్రామస్తులు బోనాలతో తరలి వెళ్లారు. ఎస్సై ఎస్‌కే హమీద్ బందోబస్తు ఏర్పాటు చేయించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు ఆలయంలో పూజలు నిర్వహించారు.

పాంనూర్‌లో కంతమహేశ్వర స్వామి ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని పాంనూర్ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంతమహేశ్వరస్వామి–సురమాంబదేవి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పురుషులు జలబిందెలతో కాటమయ్యకు జలాభిషేకం చేయగా మహిళలు మంగళహారతులతో పసుపు, కుంకుమ, పంచామృతాలతో అభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా గౌడ కులపెద్దలు మాట్లాడుతూ ఉత్సవాలు మూడ్రోజులు నిర్వహిస్తామని, సోమవారం బోనాలు, మంగళవారం పట్నాలు వేయడం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. కాగా గ్రామంలో కాటమయ్య ఉత్సవాలతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోతి రేణుక–రాములు, గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి బాబు, బుచ్చయ్య, రమేష్, రాజు, ఎల్లయ్య, సంపత్, కుమారస్వామి, శ్రీధర్, వంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: కాటమయ్య ఉత్సవాల్లో పాల్గొన్న గౌడ కులస్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జఫర్‌గఢ్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు



బచ్చన్నపేట: కొన్నె ప్రభుత్వ పాఠశాలలో 1994-95 బ్యాచ్ విద్యార్థులు

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1995–96లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా ఒక దగ్గరకు చేరుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు హనుమంతరావు, ఉమామహేశ్వర్ రావు, వాసుదేవరావు, బలరాం, కృష్ణారావులను ఘనంగా సన్మానించారు.

చీటూరు ఉన్నత పాఠశాలలో..

లింగాలఘణపురం : మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహ్మలుతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సిద్దిరాములు, బాలకిషన్, ఏకనాథం, మురళీధర్, ప్రభాకర్, రమాదేవిలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండారి రమేష్, దశరథ, సత్యనారాయణ, శశిధర్‌రెడ్డి, కృష్ణ, సురేష్, మూర్తి, రఘు, మంజుల, రాము, చంద్రశేఖర్, పద్మ పలువురు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 2006–07 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకే పాఠశాలలో కలిసి చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడి జీవనం సాగిస్తూ ఎన్నో ఏళ్ల తర్వాత పాఠశాల వేదికగా అందరూ కలుసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివేక్‌సింగ్, సారంగం, వరుణ్, సంపత్, శంకర్, వెంకన్న, శివ, ప్రశాంత్, రజనీకాంత్, సురేష్, దివ్య, శ్రీలత, చాందిని, శ్రావ్య, శ్వేతతో పాటు తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.40 వేల విలువ గల వాటర్ ప్లాంట్‌ను అందజేశారు.



లింగాలఘణపురం: చీటూరు పాఠశాలలో..



రఘునాథపల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఇసుక ట్రాక్టర్ సీజ్.. ఆరుగురిపై కేసు



రఘునాథపల్లి : మండలంలోని కొత్తగూడెం గ్రామ శివారు వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొత్తగూడెం వాగునుంచి ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన నాసగోని సుమన్, రాజశేఖర్, కొయ్యడ నవీన్, నర్సయ్య, నూనె యాదగిరి, వీరయ్యలు అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు.అనంతరం ట్రాక్టర్‌ను సీజ్‌చేసి మైనింగ్ అధికారులకు అప్పగించడంతో పాటు వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.